# రేవంత్‌రెడ్డీ.. మీ ప్రాధాన్యత దేనికి?

- పేద పిల్లలకు బుక్కెడు బువ్వకా? లక్షన్నర కోట్లతో మూసీ అభివృద్ధికా?
- కాళేశ్వరం కూలిందన్నవ్.. మరిప్పుడు కాళేశ్వరంతో గోదావరినీళ్లను మూసీలోకి ఎట్ల తెస్తా అంటున్నవ్?
- హాస్టళ్లకు మెస్ చార్జీలు ఇస్తలేరు
- స్కూళ్లలో టాయిలెట్స్ లేక బాలికలు క్యూ కడుతున్నరు
- గాంధీలో మందుల్లేక అవస్థలు
- సుందరీకరణ పేరుతో ప్రజలను భయపెట్టొద్దు
- మూసీ డీపీఆర్‌కే 1500 కోట్లట!
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్



మూసీ బాధితులను కలిసేందుకు వెళ్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు కాన్వాయ్‌ను తెలంగాణ భవన్ వద్ద అడ్డుకుంటున్న పోలీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : 'పేద పిల్లలకు అన్నం పెట్టేందుకు డబ్బులు లేవంటున్న సీఎం రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణ కోసం లక్షా యాభై వేల కోట్లు ఎలా వెచ్చిస్తున్నారు.. మీ ప్రాధాన్యత దేనికి? పేద పిల్లలకు బుక్కెడు బువ్వ పెట్టడానికా? లక్షన్నర కోట్లు పెట్టి మూసీ సుందరీకరణ చేయడానికా?' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు నిలదీశారు. ఎస్సీ, బీసీ హాస్టళ్లలో పిల్లలకు అన్నం పెట్టేందుకు ఏడు నెలల నుంచి మెస్ చార్జీలు చెల్లిస్తలేరని మండిపడ్డారు. 'ఇవ్వాళ మీడియాలో చూస్తున్నం.. స్కూళ్లలో ఆడ పిల్లలకు టాయిలెట్స్ లేక వందల మంది లైన్లలో నిలబడుతున్నరు' అని ఆవేదన వ్యక్తం చేశారు. 'పేద పిల్లలకు టాయిలెట్స్ కట్టడం నీ ప్రాధాన్యతనా? లక్ష కోట్లు ఖర్చు చేసి మూసీ నదిని సుందరీకరణ చేయడం నీ ప్రాధాన్యతనా?' అని ప్రశ్నించారు. మూసీ రివర్ ఫ్రంట్ బాధితులను కలిసేందుకు వెళ్లేముందు ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మూసీ సుందరీకరణ పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి హితవు పలికారు. ముందుగా మూసీలోకి మురుగు నీరు రాకుండా చేయాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారానే గోదావరి నీళ్లను మూసీలోకి తెస్తామని రేవంత్‌రెడ్డి చెప్తున్నారని, కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిపోయిందని మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు గోదావరి నీళ్లను మూసీలోకి ఎలా తెస్తారని ప్రశ్నించారు. తాను సబితా ఇంద్రారెడ్డితో కలిసి గాంధీ దవాఖానకు వెళ్లి చూస్తే రోగులు మందుల్లేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో మందుల సరఫరా నిలిచిపోయిందని మండిపడ్డారు. కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు బంద్ చేశారని, డబ్బుల్లేక నిలిపేశామని చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది తుగ్లక్ ప్రభుత్వంగా, పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని దుయ్యబట్టారు.

### ఇచ్చిన హామీలు నిలబెట్టుకోండి

ముందుగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, తుక్కుగూడలో సోనియాగాంధీ ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలుపుకోవాలని హరీశ్ హితవు పలికారు. మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్నవారి మెడ మీద కత్తి పెట్టి ఎందుకు మార్క్ చేస్తున్నారు? అని ప్రశ్నించారు. సుందరీకరణ పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. ఫార్మాసిటీకి కేసీఆర్ 15 వేల ఎకరాల భూమిని సేకరిస్తే ఫార్మాసిటీని పక్కనబెట్టి రియల్ ఎస్టేట్ బ్రోకర్ల సాయంతో ఫోర్త్‌సిటీ నిర్మిస్తానని రేవంత్‌రెడ్డి అంటున్నారని మండిపడ్డారు. 'మూసీ డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్)కే రూ.1500 కోట్లట! ప్రపంచంలో ఎక్కడా వినలేదు' అని ఎద్దేవా చేశారు. ఆ మొత్తం ఖర్చుచేసి పేద పిల్లలకు అన్నం పెట్టొచ్చు కదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో మూసీలోకి మురుగునీరు రాకుండా 32 సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్టీపీలు) నిర్మించిందని గుర్తుచేశారు.

### పోలీసుల అడ్డగింత.. కాసేపు ఉద్రిక్తత

తెలంగాణభవన్ నుంచి ఆదివారం ఉదయం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందంతో మూసీ రివర్ ఫ్రంట్ బాధితులను కలిసేందుకు హైదర్‌షాకోట్‌కు బయలుదేరిన మాజీ మంత్రి హరీశ్‌రావును పోలీసులు అడ్డుకోబోయారు. బీఆర్ఎస్ నాయకులు వారితో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కాసేపు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకున్నది. అనంతరం పోలీసులు పక్కకు తప్పుకోవడంతో బీఆర్ఎస్ బృందం కాన్వాయ్ తెలంగాణభవన్ నుంచి బయలుదేరి వెళ్లింది.



హైడ్రాతో భయాందోళన చెందుతున్న వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

## కూల్చివేస్తామంటే ఊరుకునేది లేదు

- మీ వెంట ఉండి సర్కార్‌పై పోరాడుతాం
- సద్దుల చెరువు బాధితులకు జగదీశ్‌రెడ్డి భరోసా

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 29 : హైడ్రా తరహాలో సూర్యాపేటలోనూ కూల్చివేతలు చేపడతామంటే ఊరుకునేది లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు ప్రాంతాల్లో అధికారులు సర్వే నిర్వహిస్తుండటంతో భయాందోళనలకు గురైన వందలాది కుటుంబాల వారు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రాగా ఆయన వారికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేండ్లు కంటికి రెప్పలా కాపాడుకొని కేసీఆర్ అభివృద్ధి చేస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు ఇచ్చిన బాధ్యతలు, హామీలు మరిచి అరాచకం సృష్టిస్తున్నదని మండిపడ్డారు. ఎవరూ భయాందోళనలు చెందవద్దని, అవసరమైతే కొట్లాడుదామని పిలుపునిచ్చారు. ప్రజల జీవితాలతో ఆడుకుంటామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రజల పక్షాన పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టంచేశారు. అధికారం ఇచ్చింది దోచుకోవడానికే అనుకొని ముఖ్యమంత్రి, మంత్రులు సోయి లేకుండా, బాధ్యత మరిచి ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఇకపై ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఇండ్లు కట్టకుండా చూడాలని మాజీ సీఎం కేసీఆర్ చెప్పినట్టు ఆయన పేర్కొన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేసీఆరే కూలగొట్టాలని నాడు చెప్పాడని మాయ మాటలు చెప్తున్నాడని విమర్శించారు. కేసీఆర్ చెప్పిండని రైతు రుణమాఫీ, 4 వేల పెన్షన్, మహిళలకు రూ.2,500 వెంటనే ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రజలకు అండగా ఉంటే, సీఎం రేవంత్‌రెడ్డి వారి జీవితాలతో ఆడుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. అభివృద్ధి, సంక్షేమం మరిచిన కాంగ్రెస్ అరాచకాలు చేస్తుంటే ప్రజల్లో తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బండ చెరువు సమీపంలోని కాలనీల ప్రజలతో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## గ్యారెంటీలను గాలికొదిలి 'హైడ్రా'మా

- ప్రభుత్వ చర్యలతో ప్రజల్లో భయం పట్టుకుంది
- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

నేరేడ్‌మెట్, సెప్టెంబర్ 29: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలును గాలికి వదిలేసి హైడ్రా పేరుతో డ్రామాలు ఆడుతున్నదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మండిపడ్డారు. వినాయకనగర్ డివిజన్ బండ చెరువు సమీపంలో మౌలాలి పరిధిలోని శంకరయ్య కాలనీ, సింహాద్రినగర్, ఎన్ఎండీసీ కాలనీ, శివానంద్‌నగర్‌కాలనీతో పాటు చుట్టుపక్కల కాలనీ ప్రజలు హైడ్రా చర్యలతో భయాందోళనకు గురవుతున్నట్టు తెలుసుకుని ఆదివారం ఆయా కాలనీల్లో పర్యటించి భరోసా కల్పించారు. పర్మిషన్లు తీసుకొని, పన్నులు చెల్లించి 30 ఏండ్ల క్రితం ఇండ్లు కట్టుకున్నామని వివిధ కాలనీల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వమంటే ప్రజాసంక్షేమం కోసం పనిచేయాలని, అలా కాకుండా వారిని ఆవేదనకు గురిచేస్తున్నదని విమర్శించారు. ప్రజలు ఎంతో కష్టపడి పైసా పైసా కూడబెట్టుకొని అన్ని అనుమతులతో కట్టుకున్న ఇండ్లను ఒక్కసారిగా నేలమట్టం చేయడం దుర్మార్గమని, ప్రజలు భయాందోళనతో నిద్రలేని రాత్రులు గడుపుతూ అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, అన్ని వేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

## బుల్డోజర్లు మమ్మల్ని దాటి రావాలి

- నేను బతికున్నంత వరకు ఇండ్లను కూల్చలేరు
- ఫణిగిరికాలనీ ప్రజలకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి భరోసా
- రేవంత్‌రెడ్డి కుట్రలను అడ్డుకోవాలని బాధితుల కన్నీళ్లు
- కావాలంటే జోలెపట్టి సీఎంకు డబ్బులిస్తామని ఆవేదన



ఇండ్లు కూల్చకుండా చూడాలంటూ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని వేడుకుంటున్న వృద్ధురాలు

మన్సూరాబాద్, సెప్టెంబర్ 29 : మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్నవారు ఎలాంటి భయభ్రాంతులకు గురికావద్దని, ఇక్కడ బుల్డోజర్లు పెట్టాలంటే తమను దాటి రావాలని.. తాను బతికున్నంత వరకు ఎవరి ఇంటిని కూల్చనివ్వనని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో మూసీ పరీవాహక ప్రాంతమైన ఫణిగిరికాలనీలో బాధితులను ఆయన ఆదివారం కలిసి మాట్లాడి ధైర్యాన్నిచ్చారు. మార్కింగ్‌లు చేసినంత మాత్రాన ఎవరి ఇండ్లను కూల్చలేరని చెప్పారు. ఆరోగ్య సమస్యలతో కొన్ని రోజులుగా ప్రజలను కలువలేకపోయినట్టు తెలిపారు. అభివృద్ధి పేరుతో వేలాది మందిని నిరాశ్రయులను చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. నిర్వాసితులకు అన్యాయం జరగకుండా మూసీని అభివృద్ధి చేయాలని గత ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారని గుర్తుచేశారు. ప్రజల ఇండ్లకు ఎలాంటి నష్టం జరకుండా చూసేందుకే తనను ఎంఆర్‌డీసీ చైర్మన్‌గా నియమించారని చెప్పారు. మూసీని ప్రక్షాళన చేసేందుకు కంకణం కట్టుకున్న కేసీఆర్, నది పరీవాహక ప్రాంతంలో 32 సీవరేజ్ ట్రీట్‌మెంటు ప్లాంట్లు ఏర్పాటు చేశారని తెలిపారు. నాగోల్‌లో రూ.400 కోట్లతో ఎస్టీపీని నిర్మించామని చెప్పారు. మరో ఎనిమిది ప్లాంట్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ అభివృద్ధి పేరిట వేలాది మంది జీవితాలతో చెలగాటమాడుతున్నదని మండిపడ్డారు. చట్టబద్ధంగా స్థలాలు కొని రిజిస్ట్రేషన్లు చేయించుకొని, బ్యాంకుల ద్వారా లోన్లు తీసుకుని ఇండ్లు కట్టుకున్నారని, రెండు కోట్లతో కట్టిన ఇంటికి 30లక్షల పరిహారం ఇస్తామంటే ఎవరైనా ఒప్పుకుంటారా? అని ప్రశ్నించారు. 2013లో కేంద్రం తెచ్చిన భూసేకరణ చట్టం ప్రకారం ఎవరి నుంచైనా భూములు, ఇండ్లు స్వాధీనం చేసుకోవాలంటే మూడు వంతుల నష్ట పరిహారం చెల్లించి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. మూసీ పరీవాహక ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. పేదల ఇండ్లను కాపాడేందుకు అన్ని పార్టీలు కలిసిరావాలని కోరారు.

### ఎమ్మెల్యే వద్ద గోడు వెళ్లబోసుకున్న బాధితులు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వచ్చిన సమయంలో స్థానికంగా ఉద్విగ్న భరిత వాతావరణం నెలకొంది. కొన్నేండ్ల కింద కట్టుకున్న తమ ఇండ్లను కూల్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న కుట్రలకు అడ్డుకోవాలని ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు. ఊర్లల్లో వ్యవసాయ భూములను అమ్ముకుని వచ్చి ఫణిగిరికాలనీ, న్యూమారుతీనగర్ నార్త్ కాలనీ, సత్యానగర్, వినాయక్‌నగర్, భవానీనగర్ కాలనీల్లో ఇండ్లు కట్టుకున్నామని తెలిపారు. అన్ని అనుమతులు తీసుకున్నామని, పన్నులు కడుతున్నామని, బ్యాంకు లోన్లు ఉన్నాయని చెప్పారు. ఎప్పుడో 25 ఏండ్ల క్రితం కట్టుకున్న ఇండ్లు ఇప్పుడు మూసీ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్నాయని మార్కింగ్ చేసి వెళ్లడం దారుణమని ఆవేదన వ్యక్తంచేశారు. మార్పు.. మార్పు అని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తెచ్చిన మార్పు ఇదేనా? అని ప్రశ్నించారు. 'మమ్మల్ని చంపి మా శవాల మీదినుంచి బుల్డోజర్లను తీస్కపోవాలె తప్ప మా ఇండ్లను కూల్చనిచ్చే ప్రసక్తేలేదు' అంటూ ఆక్రోశం వెళ్లగక్కారు. కోర్టులకు వెళ్లి స్టే తెచ్చుకోవడం కష్టంగా ఉన్నదని, ఎమ్మెల్యే చొరవ చూసి స్టే తెచ్చి తమను కాపాడాలని వేడుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి డబ్బులు కావాలంటే తామంతా జోలె పట్టి తిరిగి విరాళాలు జమచేసి ఇస్తామని, తమ ఇండ్ల జోలికి మాత్రం రావద్దని వేడుకున్నారు. నాలుగైదు రోజులుగా నిద్రాహారాలు మాని ఇండ్లను రక్షించుకునేందుకు జాగారం చేస్తున్నామని, రాత్రి వేళల్లో ఏ వాహనం వచ్చినా భయమవుతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు.

- శ్రీవారి సేవలో సీజేఐ డీవై చంద్రచూడ్



హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆదివారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి స్వాగతం పలికారు. రంగనాయకుల మండపంలో చీఫ్ జస్టిస్ దంపతులకు అర్చకులు వేదాశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో లోకనాథం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


**అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం**
**1వ అంతస్తు, ''కార్పొరేట్ భవన్'', బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500068, ఫోన్ నం.లు 040-29803086/3186, ఇ-మెయిల్ : ol.hyderabad@mca.gov.in**

**గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో: అమరావతి వద్ద (ప్రారంభ అధికారపరిధి)**
కంపెనీల చట్టం, 1956 విషయంలో
**M/s. శ్రీ పూజిత చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్** (లిక్విడేషన్‌లో కలదు) **విషయంలో**
కంపెనీ పిటీషన్ నం. 28/2010
**ఇ-వేలం ద్వారా అసెట్లు/ఆస్తుల అమ్మకం కొరకు ప్రకటన**

గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం, అమరావతి వద్ద తేది: 29.08.2024 గల ఉత్తర్వులు ప్రకారం, కాగోరు కొనుగోలుదారులు నుండి ''**ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా మరియు అక్కడ ఏమున్నదో అదే ప్రాతిపదిక**''పై కంపెనీ (లిక్విడేషన్‌లో కలదు) యొక్క దిగువ అసెట్లు/ఆస్తులు అమ్మకానికి సంబంధించి ఇ-టెండర్లు కోరబడుచున్నవి.
**అసెట్లు/ఆస్తులు, రిజర్వు ధర, బయానా మరియు బిడ్ పెంపుదల మొత్తం యొక్క వివరాలు దిగువ విధంగా ఉన్నవి:**

| అసెట్లు/ఆస్తుల యొక్క వివరణ | రిజర్వు ధర (రూ.) | బయానా (EMD) (రూ.) | బిడ్ పెంపుదల విలువ (రూ.) |
|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్, NTR జిల్లా, విజయవాడ, గవర్నర్‌పేట్, మ్యూజియం రోడ్, అమ్మన ఎస్టేట్స్, డోర్ నం. 29-36-37, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్ వద్దగల 1923 చ.అడుగుల (కామన్ ఏరియా కలుపుకుని) విస్తీర్ణంగల ఫ్లాట్ (RCC రూఫ్డ్ కమర్షియల్ బ్లాక్), మెషినరీ,ఎక్విప్‌మెంట్ మరియు ఫర్నిచర్, విండో/స్ప్లిట్A/C,సేఫ్టీ లాకర్, కంప్యూటర్, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ & ఆఫీస్ ఎక్విప్‌మెంట్ మొదలగువాటితో సహా | 1,19,50,000 | 11,95,000/- (వడ్డీ లేకుండా) | 1,00,000/- |

**గమనిక: i) 18.10.2024 & 19.10.2024 తేదీలలో ఉ. 11.00 గం. నుండి సా. 5.00 గం.**మధ్య అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, డోర్ నెం.29-36-37, అమ్మన ఎస్టేట్స్, మ్యూజియం రోడ్, గవర్నర్‌పేట్, విజయవాడ, ఎన్‌టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ వద్ద గల పై అసెట్లు/ఆస్తులను తనిఖీ చేసుకోవచ్చు.
**ii)** ఆన్‌లైన్ ఇ-వేలంలో పాల్గొనుటకు టెండరుదారులు **అఫీషియల్ లిక్విడేటర్ అకౌంట్** అనగా **"EMD ACCOUNT", కరెంట్ అకౌంట్ No.0207002100146966, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ట్రూప్ బజార్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్, IFS కోడ్: PUNB0020700**లో RTGS/NEFT విధానం ద్వారా **రూ. 2,000/- (రూపాయలు రెండు వేలు మాత్రమే)** వాపసు ఇవ్వబడని మరియు సర్దుబాటు చేయబడని ఇ-వేలం పార్టిసిపేషన్ రుసుము మరియు పైన తెలిపిన **బయానా మొత్తం (వడ్డీ లేదు)** చెల్లించాల్సి వుంటుంది. పార్టిసిపేషన్ రుసుము మరియు బయానా మొత్తం డిపాజిట్ చేయుటకు ఆఖరి తేదీ **05.11.2024న సా. 4.00 గం. వరకు** మరియు మద్దతు డాక్యుమెంట్లుతో పాటు ఆన్‌లైన్ ఆఫర్ /బిడ్ ఫారం దాఖలు చేయుటకు ఆఖరి తేది **06.11.2024న సా. 4.00 గం.వరకు.**
**iii)** టెండరుదార్లు వెబ్‌సైట్: **https://ol.auctiontiger.net** ద్వారా తమ ఆన్‌లైన్ ఆఫర్ దాఖలు చేయాలి. అఫీషియల్ లిక్విడేటర్ వారు ఇంటర్నెట్ కనెక్టివిటీ సమస్య, నెట్‌వర్క్ సమస్య, సిస్టమ్ క్రాష్ డౌన్, విద్యుత్ వైఫల్యం మరియు అటువంటి ఇతర కారణాలకు బాధ్యత వహించరు.
**iv)** ఇ-వేలం గురించి వివరాలు/ సహాయం/విధానం/ఆన్‌లైన్ శిక్షణ కొరకు కాగోరు బిడ్డర్లు **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆక్షన్ టైగర్)** కస్టమర్ కేర్ నంబర్‌పై సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించవచ్చును. **మొబైల్ నం. +91 9722778828.**
**v)** పై ఆస్తుల/ అస్సెట్ల ఇ-వేలం/ బిడ్డింగ్ అర్హత గల బిడ్డర్ల మధ్య ఆన్‌లైన్ ఇంటర్-సె-బిడ్డింగ్ ద్వారా నిర్వహించబడును. సదరు బిడ్డర్లు ''బిడ్ ఇంక్రిమెంట్ అమౌంట్'' ద్వారా వారి ఆఫర్‌ను పెంచవచ్చును.
**vi)** ఇ-వేలం వెబ్‌సైట్ **https://ol.auctiontiger.net** ద్వారా ఇ-వేలం అమ్మకం పూర్తి అయ్యేముందు చివరి నిమిషంలో బిడ్ వేయబడితే ప్రతిసారీ 10 నిమిషాల ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్‌తో **08.11.2024న ఉ. 11.30 గం. నుండి మ. 2.30 గం.** మధ్య నిర్వహించబడుతుంది.
**vii)** అమ్మకం గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం, అమరావతి యొక్క నిర్ధారణకు లోబడి ఉంటుంది. అఫీషియల్ లిక్విడేటర్ మరియు గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం ఎటువంటి కారణాలు తెలుపకుండా ఏదైనా ఆఫర్‌ను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు వారి హక్కులు కలిగి ఉన్నారు.
**viii)** కంపెనీ (లిక్విడేషన్‌లో కలదు) విషయంలో ఆసక్తి కలిగిన సెక్యూర్డ్ క్రెడిటార్స్/ అన్‌సెక్యూర్డ్ & ప్రిఫరెన్షియల్ క్రెడిటార్స్/ కంట్రిబ్యూటర్స్/ఎక్స్-డైరెక్టర్స్/ కేంద్ర & రాష్ట్ర ప్రభుత్వ అథారిటీలు, గవర్నమెంట్/సెమి గవర్నమెంట్ /స్థానిక సంస్థలు మరియు అన్ని ఇతర పార్టీలకు నోటీసుగా ఈ అమ్మకం ప్రకటనను పరిగణించవలెను.
**ix)** కాగోరు కొనుగోలుదారు ప్రతిపాదిత ఇ-వేలంలో పాల్గొనుటకు ముందు ఏవైనా అవసరమైన వాటికి సంబంధించి తమకుతాము పూర్తిగా సంతృప్తి పడేందుకు ప్రకటన తేది నుండి పైన తెలిపిన తనిఖీ తేది వరకు ఏదైనా పని రోజున **మ. 2.00 గం. నుండి మ. 3.00 గం.**మధ్య అఫీషియల్ లిక్విడేటర్, హైదరాబాద్ వారి కార్యాలయాన్ని దర్శించి సంబంధిత ఫ్లాట్ డాక్యుమెంట్లను పరిశీలించుకోవచ్చు మరియు రెవెన్యూ/సంబంధిత అథారిటీల నుండి నేరుగా సంబంధిత రెవెన్యూ రికార్డులు/లొకేషన్ మ్యాప్ కూడా పరిశీలించుకోవచ్చు. భవిష్యత్‌లో దీనికి సంబంధించి ఏదైనా అభ్యంతరం ఉంటే, దానిని అఫీషియల్ లిక్విడేటర్ పరిగణించజాలరు.
**x) అమ్మకం నియమ నిబంధనలతోపాటు** పై ఇ-వేలం యొక్క ఇతర వివరాలు వెబ్‌సైట్ **https://ol.auctiontiger.net**లో లభిస్తాయి.
**xi)** పై నియమ నిబంధనలను ఏ సమయంలోనైనా గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం/ అఫీషియల్ లిక్విడేటర్ ద్వారా సడలించవచ్చును/ రద్దు చేయవచ్చును/తదుపరిగా పేర్కొనవచ్చును.

సం/-
(U.K.సాహూ, ICLS)
అఫీషియల్ లిక్విడేటర్,
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్

తేది: 24.09.2024
ప్రదేశం: హైదరాబాద్,
ఫోన్: 040-29803086, 29803186




కార్వాన్‌లోని మూసీ పరీవాహక ప్రాంతమైన దరియాబాగ్ బస్తీవాసులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

## ప్రభుత్వ దాష్టీకాలను అడ్డుకుంటాం

- పేదలకు అండగా బీఆర్ఎస్ ఉంటది
- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

కార్వాన్, సెప్టెంబర్29: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదపై చేస్తున్న దాష్టీకాలను అడ్డుకొని తీరుతామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు. కార్వాన్‌లోని మూసీ పరీవాహక ప్రాంతమైన దరియాబాగ్‌లోని పేదల బస్తీలో ఇండ్ల తొలగింపు కోసం అధికారులు మార్కింగ్ చేయగా ప్రజలు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి ఆదివారం దరియాబాగ్ బస్తీకి చేరుకొని స్థానికులతో మాట్లాడారు. ఎవరూ ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. పేదలకు లేనిపోని ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చి.. ఇప్పుడు పేదల ఇండ్లనే కూల్చుతుండడం కాంగ్రెస్ ప్రభుత్వ రాక్షసత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. దరియాబాగ్ ప్రజల ఇండ్లపైకి బుల్డోజర్లు వస్తే కూల్చకుండా తాము అడ్డుకుంటామని చెప్పారు. ఆయనవెంట బీఆర్ఎస్ నాయకులు ముత్యాల భాస్కర్, పట్లూరి రఘు, యాద శ్రీనివాస్ గుప్తా ఉన్నారు.

## మురికివాడల జోలికి వెళ్లొద్దు: దానం



ఖైరతాబాద్, సెప్టెంబర్ 29 : పేదలు నివసించే మురికివాడల జోలికి వెళ్లొద్దని హైడ్రా, మూసీ రివర్ ఫ్రంట్ అధికారులకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో జీవిస్తున్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండానే వారి భవనాలను కూల్చివేయడం సరికాదని తెలిపారు. గ్రేటర్‌లో ఎన్నో పెద్ద పెద్ద భవంతులు ఉన్నాయని, వాటి జోలికి పోకుండా పేదల ఇండ్లను కూల్చివేయడేమిటని ప్రశ్నించారు. ఇండ్లకు రెడ్‌మార్క్ పెట్టడం తొందరపాటు చర్యగా అభివర్ణించారు. బాధితులకు ముందుగా వసతి కల్పిస్తే మంచిదని సూచించారు.

## బీసీ రిజర్వేషన్లు పెంచాలి

- ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- రాహుల్‌గాంధీకి బహిరంగ లేఖలో ఆర్ కృష్ణయ్య



హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో బీసీలకు కల్పిస్తున్న రిజర్వేషన్లను 42శాతానికి పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ లోక్‌సభ పక్షనేత రాహుల్‌గాంధీకి రాసిన బహిరంగలేఖను ఆయన ఆదివారం మీడియాకు విడుదల చేశారు. బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పటి వరకు కులగణన ప్రక్రియ ప్రారంభం కాలేదని లేదని నిప్పులు చెరిగారు. జాతీయ స్థాయిలో కుల గణన చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తున్నారని, చిత్తశుద్ధి ఉంటే అధికారంలో ఉన్న తెలంగాణలో కుల గణన చేపట్టాలని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 50శాతం సీలింగ్ ఉన్నదని చెప్పి తప్పించుకునేందుకు యత్నించొద్దని చురకలంటించారు. అసెంబ్లీలో చట్టం చేసి 42శాతం రిజర్వేషన్లను పెట్టొచ్చని, అన్ని పార్టీలు సహకరిస్తాయని తెలిపారు.

## మూడు ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధం

- కరీంనగర్ గ్రాడ్యుయేట్, టీచర్.. నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలపై నజర్
- ఓటరు నమోదుపై వివిధ పార్టీల దృష్టి
- అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాల్సిందే
- 30 నుంచే ఓటరు నమోదుకు అవకాశం

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో మరో మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఆయా చోట్ల ఓటరు నమోదుకు రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలోని కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ స్థానాలు, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల స్థాయి ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీల పదవీ కాలం వచ్చే మార్చి 29వ తేదీతో ముగియనున్నది. ఆయా స్థానాల్లో ఎన్నికల కోసం ఈనెల 30 నుంచి ఓటరు నమోదు ప్రారంభంకానున్నది. ఆయా స్థానాల నుంచి ప్రస్తుతం టీ జీవన్‌రెడ్డి, రఘోత్తంరెడ్డి, నర్సిరెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఫిబ్రవరి నెలాఖరులో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నదని అంచనా వేస్తున్నారు. దీని కోసం డిసెంబర్ నెలాఖరు కల్లా ఓటరు జాబితాను ప్రకటించడానికి ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఓటరు నమోదుకు నవంబర్ 1 కటాఫ్ తేదీగా నిర్ణయించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవాల్సిందే. గతంలో ఓటు ఉన్నా మరోసారి ఓటు నమోదు చేసుకోవాల్సిందేనని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. 2019లో ఆయా స్థానాలకు ఎన్నికలు జరగ్గా అప్పుడు తక్కువగా ఓట్లు నమోదయ్యాయి. 4 ఉమ్మడి జిల్లాల్లో కలిపి కేవలం 1.96 లక్షల మంది పట్టభద్రులే ఓటర్లు నమోదు చేసుకున్నారు. అదే ఏడాది కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 23 వేల మంది, నల్లగొండ టీచర్ నియోజకవర్గంలో 21 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఈసారి మూడు నియోజకవర్గాల్లో ఓటర్ల నమోదు సంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

**2019 ఎన్నికల సమయంలో గ్రాడ్యుయేట్, టీచర్ నియోజకవర్గ ఓటరు వివరాలు**

| జిల్లాలు | ఓటర్లు | పోలింగ్ కేంద్రాలు |
|---|---|---|
| కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ (గ్రాడ్యుయేట్) | 1,96,321 | 313 |
| కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ (టీచర్) | 23,214 | 253 |
| నల్లగొండ, ఖమ్మం, వరంగల్ (టీచర్) | 20,888 | 181 |

